క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హన్మకొండ: హనుమకొండలోని పలు ప్రాంతాల్లో ఈనెల 19న విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని ఎన్పీడీసీఎల్ హనుమకొండ టౌన్ డీఈ జి.సాంబరెడ్డి తెలిపారు. నయీంనగర్, పాత ఆర్టీఓ కార్యాలయం, లష్కర్ సింగారం, రాంనగర్, రాజాజీనగర్, పోలీసు హెడ్క్వార్టర్ వెనుక వైపు ప్రాంతాల్లో ఉదయం 9గంటల నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో వివరించారు.

నేడు ఓటరు జాబితా ప్రదర్శన

హసన్పర్తి: ఓటరు జాబితాను గురువారం ప్రదర్శించనున్నట్లు ఎంపీడీఓ ప్రవీణ్కుమార్ తెలిపారు. రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు గుర్తింపు పొందిన పార్టీ నాయకుల సమక్షంలో ఉదయం జాబితాను విడుదల చేయనున్నట్లు పేర్కొన్నారు.

ప్రైవేట్ ఆస్పత్రిలో వృద్ధురాలి మృతి

బంధువుల ఆందోళన

కాజీపేట అర్బన్: నగరంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ వృద్ధురాలు మృతి చెందింది. దాంతో బంధువులు ఆందోళనకు దిగిన సంఘటన బుధవారం చోటు చేసుకుంది. మృతురాలి బంధువుల కథనం ప్రకారం వారం రోజుల క్రితం వరంగల్ జిల్లా పర్వతగిరికి చెందిన సుశీల(72) కాలుకు ఇన్ఫెక్షన్ సోకడంతో చికిత్స నిమిత్తం నగరంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించి కిడ్నీలో రాళ్లు ఉన్నాయని వాటిని తొలగించేందుకు ఆపరేషన్ చేయాలని వైద్యులు సూచించి ఆపరేషన్ చేశారు. రోగికి తీవ్ర రక్తస్రావం అవుతోందని, రక్తం కావాలని కోరగా బ్లడ్ బ్యాంక్ నుంచి మంగళవారం రక్తాన్ని సేకరించి అందజేశారు. కాగా, బుధవారం ఉదయం వృద్ధురాలు చనిపోయిందని వైద్యులు తెలిపారు. కాగా, ఆస్పత్రిలో సరైన వైద్యం అందించకపోవడంతోనే సుశీల మృతి చెందినట్లు ఆరోపిస్తూ బంధువులు ఆందోళనకు దిగారు. వారితో ఆస్పత్రి యాజమాన్యం చర్చలు జరిపి అనంతరం మృతదేహాన్ని అప్పగించారు.

ఆలయ స్థలాలపై సర్వే చేయాలి

మడికొండ: మడికొండలో కనకదుర్గ ఆలయం ముందు నిర్మించిన కట్టడాలపై మడికొండ గ్రామానికి చెందిన పల్లపు అశోక్ పెట్టిన కేసుకు సంబంధించి ఆర్డీఓ ఇచ్చిన నివేదికలో తప్పులున్నాయని లోకాయుక్త న్యాయమూర్తి సీవీ రాములు అసంతృప్తి వ్యక్తం చేసినట్లు అశోక్ తెలిపారు. లోకాయుక్తకు హాజరైన పల్లపు అశోక్ మాట్లాడుతూ రెవెన్యూ పహాణీ రికార్డు ప్రకారం 1954 – 1955, 1965 – 1966 సంవత్సరంలో ఆలయానికి సంబంధించి 13 గుంటల వ్యవసాయేతర భూమి ఉందని పేర్కొన్నారు. ఆ భూమిని దేవాదాయ, ధర్మాదాయ చట్టం 1987 ప్రకారం అప్పటి ఆర్డీఓ హద్దులు నిర్దేశించకపోవడంతో ఆలయ భూమిలో అక్రమ నిర్మాణాలు వెలిచాయని తెలిపారు. మళ్లీ సర్వే నిర్వహించి రెవెన్యూ రికార్డుతో నివేదిక తయారు చేసి అక్టోబర్ 23వ తేదీ నాటికి సమర్పించాలని ఆర్డీఓను న్యాయమూర్తి ఆదేశించారని అశోక్ వివరించారు.

విద్యార్థికి అభినందనలు



మామునూరు: భారత వ్యవసాయ పరిశోధన మండలి (ఐసీఏఆర్) పోస్ట్ గ్రాడ్యుయేట్ ప్రవేశ పరీక్షలో శంభునిపేట విశ్వనాథ కాలనీకి చెందిన విద్యార్థి సుష్మాక్షిత.. 349వ ఆల్ ఇండియా ర్యాంక్ సాధించింది. ఈమేరకు శంభునిపేటలో కర్నె రవీందర్, సామాజిక వేత్త, వెంకటేశ్వర కాలనీ అధ్యక్షుడు నాగబండి శ్రీనివాస్ గుప్తా ఆధ్వర్యంలో సుష్మాక్షితను బుధవారం అభినందించారు. కార్యక్రమంలో పరశురాములు, పల్లకొండ సురేష్, ఎల్లగౌడ్ పాల్గొన్నారు.

పరపతి సంఘం కార్యాలయంపై గుర్తుతెలియని వ్యక్తుల దాడి



కాశిబుగ్గ: 19వ డివిజన్ కాశిబుగ్గ యువజ్యోతి కాలనీలోని యువజ్యోతి పరస్పర సహాయక సహకార పరపతి సంఘం కార్యాలయంపై మంగళవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేశారు. సౌండ్ బాక్స్లు, వినాయక చవితికి ఏర్పాటు చేసిన ఫ్లెక్సీని ధ్వంసం చేశారని సంఘం సభ్యులు తెలిపారు. ఈ ఘటనపై ఫిర్యాదు చేశామని, దాడికి పాల్పడిన వారిని గుర్తించి కఠినంగా శిక్షించాలని పరపతి సంఘం అధ్యక్షుడు దిడ్డి సుదర్శన్, యూత్ అధ్యక్షుడు గోపి కోరారు.

జర్నలిస్ట్ హౌసింగ్, వెల్ఫేర్ కమిటీ రాష్ట్ర కన్వీనర్గా వెంకటరమణ



నయీంనగర్: ఐజేయూ అనుబంధ తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టుల సంఘం (టీయూడబ్ల్యూజే) జర్నలిస్ట్ హౌసింగ్, వెల్ఫేర్ కమిటీ రాష్ట్ర కన్వీనర్గా వల్లాల వెంకటరమణ నియమితులయ్యారు. ఈమేరకు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు విరాహత్ అలీ ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయనకు పలువురు అభినందనలు తెలిపారు.

మహిళలు, బాలికలకు అండగా 'సఖి'

వరంగల్: మహిళలు, బాలికలకు సఖి సెంటర్ అన్ని విధాలుగా అండగా ఉంటోందని సఖి సెంటర్ లీగల్ కౌన్సెలర్ శోభారాణి తెలిపారు. ఏనుమాముల గ్రామంలో బుధవారం జరిగిన స్లమ్ లెవల్ ఫెడరేషన్ సమావేశంలో మహిళా సంఘుల సభ్యులతో అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళల, బాలికల రక్షణ, భద్రత కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సఖి సెంటర్లను నడిపిస్తున్నాయని గుర్తుచేశారు. బాధిత మహిళలకు కౌన్సెలింగ్, పోలీస్, న్యాయ, వైద్య సహాయం, తాత్కాలిక వసతి వంటి సేవలను 24 గంటలు అందుబాటులో ఉంటూ ఉచితంగా అందిస్తామని తెలిపారు. మహిళలు, బాలికలు అత్యవసర పరిస్థితుల్లో హెల్ప్ లైన్ 181, 100, 1098, 14567 కాల్ చేస్తే రెస్క్యూ చేసి సహాయం అందిస్తామన్నారు. భర్తల ద్వారా బాధించబడుతున్న మహిళలకు గృహహింస చట్టంతో అందించే సౌకర్యాలు, చైల్డ్ కస్టడీ, మెయింటెనెన్స్, రెసిడెన్స్ ఆర్డర్ వంటి విషయాలపై అవగాహన కల్పించారు. గృహ హింస చట్టానికి సంబంధించి కోర్టులో కేసు వేయడానికి జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ ద్వారా ఉచితంగా న్యాయ సహాయం అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కేసు వర్కర్ తిరుమల, సుజాత, మహిళా సంఘ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.



వరంగల్: పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సఖి సెంటర్ నిర్వాహకులు, మహిళలు

చట్టాలపై అవగాహన కలిగిఉండాలి

మడికొండ: మహిళలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని సఖి సెంటర్ కేస్ వర్కర్ వినీల సూచించారు. మడికొండలోని అంబేడ్కర్ భవనంలో బుధవారం సఖి సేవలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ముఖ్యంగా గృహ హింస, లైంగిక వేధింపులు, పనిచేసే చోట వేధింపులు, అత్యాచారాలు, తదితర వేధింపుల నుంచి రక్షణ పొందటానికి సఖి సెంటర్ పని చేస్తోందని వివరించారు. సఖి సెంటర్ 24 గంటలపాటు పని చేస్తుందని చెప్పారు. బాధిత మహిళలు, బాలికలు 181 టోల్ఫ్రీ నంబర్ లేదా, 0870 2452112, 73829 83088 నంబర్లలో సంప్రదించవచ్చని తెలిపారు. పారామెడికల్ సరిత, బ్యూటీషియన్ టీచర్ నాగరాణి, మహిళలు పాల్గొన్నారు.



మడికొండ: అవగాహన కల్పిస్తున్న వినీల

బిడ్డను కంటికి రెప్పలా చూసుకోవాలి



పోషకాలు అందజేస్తున్న రమాదేవి, మోహన్రావు

ఖిలా వరంగల్: బిడ్డను కంటికి రెప్పలా చూసుకోవాలని ఐసీడీఎస్ ప్రాజెక్ట్ ఉర్సు సెక్టార్ సూపర్వైజర్ బత్తిని రమాదేవి, హెల్త్ సూపర్వైజర్ మోహన్రావు సూచించారు. వరంగల్ ఉర్సు కమ్యూనిటీ హాల్లో అంగన్వాడీ టీచర్ విజయలక్ష్మి ఆధ్వర్యంలో పోషణ మాసోత్సవాన్ని బుధవారం నిర్వహించారు. బిడ్డకు తల్లిపాలు ఎంతో శ్రేష్టమని అన్నారు. అనంతరం, చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు పోషకాహారం అందజేశారు. శ్రీలత, సరిత, రాధ, కల్యాణి, స్వరూప, సవిత, సునీత పాల్గొన్నారు.

చిన్నారులను అంగన్వాడీల్లో చేర్పించాలి

ఆటపాటలతో విద్యనందించే అంగన్వాడీ కేంద్రాల్లో చిన్నారులను చేర్పించాలని కార్పొరేటర్ వేల్పుగొండ సువర్ణ సూచించారు. ఈమేరకు ఖిలా వరంగల్ తూర్పుకోట ముదిరాజ్ వీధిలోని అంగన్వాడీ కేంద్రంలో సూపర్వైజర్ కల్యాణి ఆధ్వర్యంలో పోషక మాసోత్సవ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాల్లో నాణ్యమైన విద్యను అందిస్తున్నట్లు తెలిపారు. అనంతరం పిల్లల తల్లులు, గర్భిణులు, బాలింతలతో పోషక మాస ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో రమ, రాణి, రాజమణి, కవిత, రజిత పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ జల పర్యవేక్షణ దినోత్సవం



ఖిలా వరంగల్: వరంగల్ శంభునిపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో అభ్యుదయ సేవా సమితి, ఫ్రెష్ వాటర్ నెట్ వర్క్ సౌత్ ఆసియా సంయుక్త ఆధ్వర్యంలో ప్రపంచ జల పర్యవేక్షణ దినోత్సవాన్ని బుధవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఫ్రెష్ వాటర్ నెట్వర్క్ సౌత్ ఆసియా రాష్ట్ర కన్వీనర్ మండల పరశురాములు హాజరై నీటి వల్ల కలిగి ప్రయోజనాలను వివరించారు. హెచ్ఎం శారదాబాయి, ఉపాధ్యాయుడు రవీందర్ పాల్గొన్నారు.

'పోపా' పద్మశాలి ప్రతిభా పురస్కార్



నయీంనగర్: పద్మశాలి అఫీషియల్స్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ వరంగల్ జిల్లా ఆధ్వర్యంలో పద్మశాలి విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు ఇవ్వనున్నట్లు పోపా వరంగల్ జిల్లా అధ్యక్షుడు గుండు కామేశ్వర్రావు, కన్వీనర్ గోసికొండ సుధాకర్ తెలిపారు. హనుమకొండ ప్రెస్ క్లబ్లో బుధవారం ఏర్పాటుచేసిన సమావేశంలో కామేశ్వర్రావు మాట్లాడుతూ 10వ తరగతి, ఇంటర్, నీట్, ఐఐటీ, జేఈఈ మెయిన్స్, ఈఏపీసెట్లో ఉత్తమ మార్కులు పొందిన విద్యార్థులు ఈనెల 28లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమం అక్టోబర్ 14న కొత్తవాడలోని పద్మశాలి భవనంలో జరగనున్న కార్యక్రమ వివరాలకు 93901 22559 నంబర్లో సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో సభ్యులు ధర్మపురి రాజగోవిందు, పాము శ్రీనివాస్, అశోక్కుమార్ పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై నిర్లక్ష్యం తగదు

వరంగల్ అర్బన్: ప్రజా సమస్యలు పరిష్కరించడంలో అధికారుల నిర్లక్ష్యం తగదని మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ హెచ్చరించారు. బుధవారం బల్దియా ప్రధాన కార్యాలయం ఎదుట 40వ డివిజన్ కార్పొరేటర్ మరుపల్లి రవి ఆధ్వర్యంలో జరిగిన నిరసన దీక్షకు హాజరై సంఘీభావం ప్రకటించారు. ఈసందర్భంగా నరేందర్ మాట్లాడుతూ.. మేయర్ గుండు సుధారాణి పక్షపాత వైఖరి అవలంబించడం సరికాదన్నారు. డివిజన్లో ప్రజలకు మౌలిక సదుపాయాలతో పాటు అభివృద్ధి పనులు చేపట్టకపోవడం వల్ల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ప్రజలకు సమస్యలు పరిష్కరించే వరకు దీక్ష విరమించేది లేదన్నారు. నిరసన దీక్షకు బీజేపీ రాష్ట్ర నాయకులు ఎరబెల్లి ప్రదీప్రావు సంఘీభావం ప్రకటించి మాట్లాడారు. రాజకీయాలకతీతంగా ఏ కార్యక్రమం చేపట్టిన తన మద్దతు ఉంటుందన్నారు. అనంతరం 13 డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అధికారులకు అందజేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు దిడ్డి కు మారస్వామి, ఆవాల రాధికారెడ్డి, గుగులోతు దివ్య రాణి, సీపీఎం నాయకుడు ఎస్.బాబు, బీజేపీ నాయకులు ఎడ్ల అశోక్ రెడ్డి, పుల్లారావు, తాబేటి వెంకట్గౌడ్ పాల్గొన్నారు.



సంఘీభావం ప్రకటిస్తున్న నన్నపునేని నరేందర్

స్థానికత నిబంధనలతో అన్యాయం



దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

విద్యారణ్యపురి: ఈ విద్యా సంవత్సరంలో మెడికల్ అడ్మిషన్లలో స్థానికతను నిర్ధారిస్తూ రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ ఇచ్చిన జీఓ నంబర్ 33లో పేర్కొన్న నిబంధనలతో తెలంగాణ మెడికల్ విద్యార్థులకు అన్యాయం జరుగనుందని ఏబీవీపీ జిల్లా కన్వీనర్ సుజిత్ ఆందోళన వ్యక్తం చేశారు. ఈమేరకు అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) ఆధ్వర్యంలో హనుమకొండలోని అశోక జంక్షన్లో ప్రభుత్వ దిష్టిబొమ్మను బుధవారం దహనం చేస్తుండగా పోలీసులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా సుజిత్ మాట్లాడుతూ 6వ తరగతి నుంచి ఇంటర్ వరకు ఏడేళ్లలో కనీసం నాలుగేళ్ల ప్రాతిపదికగా స్థానికతను నిర్ధారించే ప్రక్రియ, దాంతోపాటు హైకోర్టు సూచించిన విధానాన్ని కొనసాగించి, విద్యార్థులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

పత్తి పరిశ్రమలోని సమస్యలు పరిష్కరించాలి

వరంగల్: తెలంగాణ రాష్ట్రంలో పత్తి పరిశ్రమలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ కాటన్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు, వరంగల్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ అధ్యక్షుడు బొమ్మినేని రవీందర్రెడ్డి కోరారు. ప్రభుత్వ ఆహ్వానం మేరకు హైదరాబాద్ హైటెక్ సిటీ శిల్పకళా వేదికలో ఎంఎస్ఎంఈ పాలసీ -2024 ఆవిష్కరణ కార్యక్రమంలో రవీందర్రెడ్డి బుధవారం పాల్గొన్నారు. ఈ పాలసీ వల్ల రాష్ట్ర కాటన్, సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల స్థాపన, అభివృద్ధికి దోహదపడుతుందని అన్నారు. అనంతరం వరంగల్ మహానగరాన్ని రాష్ట్ర రెండవ రాజధానిగా అభివృద్ధి చేసేందుకు తీసుకోవాల్సి చర్యలు, తెలంగాణ రాష్ట్రంలో పత్తి పరిశ్రమ ఎదుర్కొంటున్న పలు సమస్యలపై సీఎం రేవంత్రెడ్డి, మంత్రులు భట్టి విక్రమార్క, దుద్దిళ్ల శ్రీధర్బాబుకు వినతిపత్రం అందజేసినట్లు ఆయన పేర్కొన్నారు.



ఎంఎస్ఎంఈ ప్రారంభోత్సవంలో రవీందర్రెడ్డి

జన్ను అనిల్ నుంచి రక్షణ కల్పించండి

- మా ఇంటి జాగాపై దౌర్జన్యం చేస్తున్నారు
- న్యాయం చేయాలని సమీనా దంపతుల వేడుకోలు

హన్మకొండ చౌరస్తా: పైసా పైసా పోగేసి కొనుక్కున్న ఇంటి జాగాలో నిర్మాణం చేపడుతుంటే జన్ను అనిల్, అతడి సోదరి జన్ను కుసుమ తమపై దౌర్జన్యం చేస్తున్నారని, అతడిపై చర్యలు తీసుకోవాలని వరంగల్ దేశాయిపేటలోని నజ్రత్పురకు చెందిన ఎండీ సమీనా, మహమూద్ పాషా దంపతులు సీపీ అంబర్కిషోర్ ఝాను కోరారు. హనుమకొండ పబ్లిక్ గార్డెన్లో బుధవారం సమీనా పాషా దంపతులు విలేకరులతో మాట్లాడుతూ.. ఏనుమాముల ఏరియా వినాయక కాలనీలోని సర్వే నంబర్ 253/ఏ లో 153.11 గజాల స్థలాన్ని 2022లో సయ్యద్ ఖాజా పాషా నుంచి కొనుగోలు చేసినట్లు తెలిపారు. పదిహేను రోజుల క్రితం ఇంటి నిర్మాణానికి పనులు మొదలు పెట్టగా.. స్థానికంగా ఉండే జన్ను కుసుమ తమ వద్దకు వచ్చి నిర్మాణం తక్షణమే నిలిపివేయాలని, లేకపోతే మా తమ్ముడు జన్ను అనిల్ గురించి మీకు తెలియదని బెదిరించారన్నారు. గతంలో కూడా స్థలం అమ్మిన సయ్యద్ ఖాజాపాషా వద్ద రూ.46 వేలు అనిల్ వసూలు చేశారని, 2023లో భూకబ్జాలకు పాల్పడుతున్న అనిల్పై అప్పటి సీపీ రంగనాథ్ పీడీ యాక్టు కేసు నమోదు చేశారని గుర్తుచేశారు. జన్ను అనిల్, కుసుమ నుంచి తమకు రక్షణ కల్పించి న్యాయం చేయాలని సమీనా దంపతులు కోరారు.



విలేకరుల ఎదుట తమ ఇంటి స్థలం పేపర్లు చూపుతున్న సమీనాపాషా దంపతులు

పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్కు సన్మానం



హన్మకొండ: సన్మానిస్తున్న బీసీ సంఘం నాయకులు



వరంగల్: జ్ఞాపిక అందజేస్తున్న మురళి, నాయకులు

హన్మకొండ: టీపీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ను బీసీ సంక్షేమ సంఘం నాయకులు సన్మానించారు. హనుమకొండకు వచ్చిన మహేష్ కుమార్ గౌడ్ను హనుమకొండ బాలసముద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు వడ్లకొండ వేణుగోపాల్, నాయకులు మర్యాద పూర్వకంగా కలిసి అభినందించారు.

జ్ఞాపిక బహూకరణ

వరంగల్ / హన్మకొండ కల్చరల్: బొమ్మ మహేష్కుమార్ గౌడ్ నగరానికి వచ్చి భద్రకాళి అమ్మవారిని బుధవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయనకు మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్రావు, మడిపల్లి కృష్ణగౌడ్ జ్ఞాపిక అందజేశారు. అదేవిధంగా చేనేత విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చిప్ప వెంకటేశ్వర్లు నేత మర్యాదపూర్వకంగా కలిసి నూలుదండతో సన్మానించి వరంగల్ కొత్తవాడలో తయారు చేసిన చేనేత కార్పెట్ను బహూకరించారు.

ఘన స్వాగతం

మడికొండ: బొమ్మ మహేష్ కుమార్ గౌడ్తో పాటు మంత్రి పొన్నం ప్రభాకర్గౌడ్కు మడికొండలో కాంగ్రెస్ నాయకులు బుధవారం ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్రెడ్డి, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు, పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్రెడ్డి, ఎమ్మెల్సీ బస్వరాజ్ సారయ్య, వరంగల్ ఎంపీ కడియం కావ్య, రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య, టీపీసీసీ ఉపాధ్యక్షుడు దొమ్మటి సాంబయ్య, పార్టీ వరంగల్ జిల్లా అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, తదితరులు పాల్గొన్నారు.

శుభాకాంక్షలు

వరంగల్ చౌరస్తా: వరంగల్ నగరానికి వచ్చిన పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్కు మాజీ మేయర్ గుండా ప్రకాశ్రావు, శాఫ్ మాజీ డైరెక్టర్ రాజనాల శ్రీహరి, తదితరులు స్వాగతం పలికారు. పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

పార్టీ బలోపేతానికి సభ్యత్వాలు దోహదం



న్యూశాయంపేట: పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎంపీ

ఖిలా వరంగల్: బీజేపీ బలోపేతానికి సభ్యత్వాలు ఎంతగానో దోహద పడుతాయని, సభ్యత నమోదు త్వరగా పూర్తిలక్ష్యాలను చేరుకోవాలని మెదక్ ఎంపీ రఘునందన్ రావు సూచించారు. వరంగల్ 34వ డివిజన్ శివనగర్లో 131వ బూత్లో బీజేపీ బూత్ అధ్యక్షుడు తాళ్లపెల్లి శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆన్లైన్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్, నాయకులు ఎర్రబెల్లి ప్రదీప్రావు, కుసుమ సతీష్, జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లాడి తిరుపతిరెడ్డి, జలగం రమేష్తో కలిసి ఆన్లైన్ సభ్యత్వాన్ని రఘునందన్ రావు ప్రారంభించారు.

కాశిబుగ్గ: 18వ డివిజన్ చెన్నారెడ్డికాలనీ దళితవాడలో డివిజన్ అధ్యక్షుడు బొడ్డు రాజేష్ ఆధ్వర్యంలో బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఎంపీ ప్రారంభించారు. అనంతరం పలువురు యువకులు బీజేపీలో చేరగా వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

న్యూశాయంపేట: విశేష్ సంపర్క్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మెదక్ ఎంపీ ఎం.రఘునందన్ రావు వరంగల్లో పర్యటించారు. ఈ సందర్భంగా నగరంలోని 36వ డివిజన్ చింతల్ ప్రాంతానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్తలు బీజేపీలో చేరారు. కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

బెంగాల్ కూలీలపై కేంద్రం మొండివైఖరి వీడాలి

హన్మకొండ: పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలో కూలీలపై కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న మొండివైఖరిని విడనాడాలని దళిత బహుజన ఫ్రంట్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చుంచు రాజేందర్ డిమాండ్ చేశారు. పశ్చిమ బెంగాల్ కూలీలకు ఉపాధి హామీ పథకం అమలు చేయాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన పోస్టు కార్డు ఉద్యమంలో భాగంగా హనుమకొండ నుంచి ప్రధానమంత్రికి బుధవారం పోస్టుకార్డులు పంపారు. ఈ సందర్భంగా రాజేందర్ మాట్లాడుతూ మూడేళ్లుగా ఉపాధి హామీ కూలీలకు పనులు కల్పించకుండా, నిధులు విడుదల చేయకుండా పనిహక్కును, చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం ఉల్లంఘిస్తోందని ఆరోపించారు. ప్రధానమంత్రి నిర్లక్ష్యం వల్ల రాష్ట్రంలోని రూ.2.5 కోట్ల మంది ఉపాధి హామీ కూలీలు ముఖ్యంగా దళిత, ఆదివాసీ, ఒంటరి మహిళలు ఆకలితో అలమటిస్తూ వలసబాట పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. డీబీఎఫ్ రాష్ట్ర మహిళా నాయకురాలు బొర్ర సంపూర్ణ, జిల్లా కార్యదర్శి మేకల అనిత, ఎడ్ల కోమల, విజయ, పుల్యాల మంజుల, సరిత, సుజాత, రజిత, పుష్ప పాల్గొన్నారు.



పోస్టు కార్డులు ప్రదర్శిస్తున్న డీబీఎఫ్ నాయకులు

సంక్షిప్తంగా

ఉర్దూ భాషలో నామకరణం చేయాలి



హన్మకొండ కల్చరల్ / న్యూశాయంపేట: హనుమకొండ బాలసముద్రంలో కోట్లాది రూపాయల వ్యయంతో నిర్మిస్తున్న కాళోజీ కళాక్షేత్రానికి తెలుగు, ఆంగ్లంతో పాటు రాష్ట్ర రెండో అధికార భాషగా ఉన్న ఉర్దూలో పేరును రాయకపోవడాన్ని ఉర్దూ భాషాభిమానులు తప్పుబడుతున్నారు. తెలంగాణ రాష్ట్ర సంస్కృతికి అద్దం పట్టే ఈ సాంస్కృతిక కేంద్రంలో ఉర్దూకు సరైన స్థానం కల్పించకపోవడం శోచనీయమని పలువురు పేర్కొంటున్నారు.

ఎమ్మెల్యే నాయినికి సన్మానం

హన్మకొండ: ప్రపంచ వెదురు దినోత్సవాన్ని పురస్కరించుకుని హనుమకొండ బాలసముద్రంలోని క్యాంపు కార్యాలయంలో వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డిని బుధవారం కలిసి వెదురు మొక్క అందించి శాలువా కప్పి మేదరి సంఘం నాయకులు సన్మానించారు. కార్యక్రమంలో మేదరి సంఘం నాయకులు కోరుట్ల రమేష్, కూచనపెల్లి దేవేందర్, వలిపిరెడ్డి శ్రీనివాస్, బొమ్మిడి రమేష్, చిలివేరు రవికుమార్, దీకొండ శివ పాల్గొన్నారు.

నీటి వృథాను అరికట్టాలి

విద్యారణ్యపురి: నీటి వృథాను అరికట్టి, పొదుపుగా వాడుకోవాలని, నీటి సంరక్షణ చాలా ముఖ్యమని ప్రేరణ ఫౌండేషన్ అధ్యక్షుడు ఉపేందర్రెడ్డి తెలపారు. హనుమకొండ జులైవాడలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రపంచనీటి పరిరక్షణ దినోత్సవంపై బుధవారం అవగాహన సమావేశం నిర్వహించారు. హెచ్ఎం భాస్కరరెడ్డి అధ్యక్షత వహించిన కార్యక్రమంలో ప్రేరణ ఫౌండేషన్ సలహాదారు మల్లారెడ్డి పాల్గొని మాట్లాడారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

కాజీపేట: ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమిస్తూ రహదారులపై తిరిగే వాహనాలను సీజ్ చేయడంతో వాహనదారులపై కేసులు నమోదు చేస్తామని ట్రాఫిక్ సీఐ నాగబాబు హెచ్చరించారు. కాజీపేట ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో నంబర్ ప్లేట్లు లేని పార్కింగ్ చేసిన పలు ద్విచక్ర వాహనాలు, నిబంధనల మేరకు లేని వాహనాలను క్రేన్ సహాయంతో బుధవారం పోలీస్ స్టేషన్కు తరలించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ప్రతీ వాహనానికి నంబర్ ప్లేట్ తప్పనిసరిగా ఉండాలని అన్నారు.

చెత్త తొలగింపు

హన్మకొండ అర్బన్: వినాయక నిమజ్జనంతో నగరంలోని సిద్ధేశ్వరాలయం సమీపంలోని గుండంలో పేరుకుపోయిన చెత్తను మెదిని ఎన్జీఓ సంస్థ ఆధ్వర్యంలో సామాజిక బాధ్యతగా పలువురు బుధవారం తొలగించి తమ ఔదార్యం చాటుకున్నారని మెదిని సంస్థ కార్యదర్శి కె.ప్రకాష్ తెలిపారు. కార్యక్రమంలో సంస్థ బాధ్యులు సుశాంత్, కార్తీక్, ప్రసాద్, త్రిదేవ్ పాల్గొన్నారు.

శ్వేతార్కలో సత్యనారాయణ వ్రతం



కాజీపేట: పట్టణంలోని స్వయంభూ శ్వేతార్క మూలగణపతి దివ్యక్షేత్రంలో సామూహిక సత్యనారాయణ వ్రతాన్ని అర్చకులు బుధవారం జరిపించారు. బ్రహ్మశ్రీ త్రిగుళ్ల శ్రీనివాస్శర్మ ఆధ్వర్యంలో వ్రత క్రతువును నిర్వహించారు. అనంతరం ఉత్సవాలు ఘనంగా జరగడానికి సహకరించిన కార్యకర్తలు, పండితులను ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు అయినవోలు వెంకటేశ్వర్లు శర్మ సన్మానించారు.

అవగాహన సదస్సు

హన్మకొండ కల్చరల్: హనుమకొండ రాంనగర్లోని వాగ్దేవి కాలేజ్ ఆఫ్ ఫార్మసీ, ఫార్మడీ విద్యార్థులు, అధ్యాపకులు స్టేషన్ఘన్పూర్ మండలం నష్కల్ గ్రామంలో బుధవారం అవగాహన సదస్సు, రోగులకు కౌన్సెలింగ్ శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో ఫార్మాడీ వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ శ్రీనివాస్రెడ్డి, డాక్టర్లు గిరిజ, స్నేహప్రియ, లావణ్య, శ్రీవర్ష, సఫియా నసీర్, మకరంద్ పాల్గొన్నారు.

విశ్వకర్మ విగ్రహ ప్రతిష్ఠాపన

వరంగల్ చౌరస్తా: వరంగల్ పిన్నావారి వీధిలోని విశ్వకర్మ విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని బుధవారం వైభవంగా నిర్వహించారు. సఫన్ గోరి, సోమరాణి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి తెలంగాణ ఎస్ఈఆర్పీటీ మేనేజర్ శ్రీరాముల శ్రీనివాస్ హాజరయ్యారు.

ఉరేసుకుని యువకుడి ఆత్మహత్య

ఖిలా వరంగల్: మెడికల్ షాపు నిర్వాహణ లేక తెచ్చిన అప్పులు కట్టే పరిస్థితి కనిపించకపోవడంతో మనస్తాపానికి గురైన మెడికల్ షాపు నిర్వాహకుడు ఫ్యానుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన బుధవారం విద్యానగర్ కాలనీ కాశికుంటలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. వరంగల్ కాశికుంటకు ఆర్ఎంపీ ఎలిసోజు అనిరుద్ (28) మెడికల్ షాపు నిర్వాహణ సరిగా లేకపోవడంతో తెచ్చిన అప్పులు తీర్చే మార్గం లేక బలవన్మరణానికి పాల్పడ్డాడు. మృతుడి తండ్రి వెంకటాచారి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్స్పెక్టర్ మల్లయ్య వివరించారు.

నివాళి

హన్మకొండ అర్బన్: గుండెపోటుతో మృతిచెందిన చాడ నర్సింహరెడ్డి మృతిపై రెడ్డి సంఘం నాయకులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎక్సైజ్ కాలనీలోని నర్సింహరెడ్డి స్వగృహంలో ఆయన మృతదేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించారు.

ఏచూరి జీవితం యువతకు ఆదర్శం



హసన్పర్తి: సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి జీవితాన్ని యువత ఆదర్శంగా తీసుకోవాలని డాక్టర్ పుల్లా శ్రీనివాస్ పిలుపునిచ్చారు. సీతారాం ఏచూరి సంస్మరణ సభను భీమారంలోని శివానీ కళాశాలలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం శ్రీనివాస్ మాట్లాడుతూ ఏచూరి తన జీవితాన్ని చివరి క్షణం వరకు ప్రజా సేవకే అంకితం చేశారని కొనియాడారు. ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు స్టాలిన్, ప్రధాన కార్యదర్శి మంద శ్రీకాంత్, జిల్లా ఉపాధ్యక్షులు బొచ్చు కల్యాణ్, సాయి, సందీప్, వినయ్, రాజ్కుమార్ పాల్గొన్నారు.